క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన నాయకులు



కేటీఆర్‌తో నాయకులు

కడ్తాల్/తలకొండపల్లి: మాజీ మంత్రి కేటీఆర్‌ను నగరంలోని ఆయన నివాసంలో శుక్రవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 27న నిర్వహించే రజతోత్సవ సభ గురించి కేటీఆర్ పలు సూచనలు చేశారని వారు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, వెంకట్‌రెడ్డి, గణేశ్, బుచ్చి బాబు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

తలకొండపల్లి: సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండల పరిధి వెల్జాల్‌కు చెందిన మల్లికెడ్ అశోక్, తుపాకుల పవన్‌లు ఆరోగ్య సమస్యలతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే సహకారంతో అశోక్‌కు రూ.60 వేలు, పవన్‌కు రూ,16 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం ఆయన వెల్జాల్‌లో బాధితులకు పార్టీ నాయకులతో కలిసి చెక్కులు అందజేశారు.

రజతోత్సవ సభకు తరలిరండి



బొట్టు పెట్టి సభకు ఆహ్వానిస్తున్న దశరథ్‌నాయక్, గిరిజన మహిళలు

కడ్తాల్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చి, జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధి పోచమ్మగడ్డతండా నుంచి ఇంటింటికీ తిరిగారు. బొట్టుపెట్టి సభకు ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనతో రాష్ట్ర ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో తిరిగి బీఆర్ఎస్ పాలన వచ్చే వరకు, కేసీఆర్ సీఎం అయ్యే వరకు గిరిజనులు కలిసికట్టుగా పోరాటాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనునాయక్, బిక్కునాయక్, అంజి, గిరిజన మహిళలు ఉన్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు

కడ్తాల్: అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేపడితే చర్యలు తీసుకుంటామని కడ్తాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అల్లాజీ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఇటీవల ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ మేరకు సర్వే నంబర్ 8లోని ఓ వెంచర్‌లో అనుమతి లేకుండా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించామని, నిర్మాణం నిలిపివేయాలని నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. ఇదే విషయమై ఠాణాలో ఫిర్యాదు చేశామని చెప్పారు. సరైన పత్రాలతో, పంచాయతి పర్మిషన్ తీసుకున్న తర్వాతే ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. నివాసాలు, స్థలం క్రయవిక్రయాల్లోనూ పత్రాలను సరి చూసుకొని ముందడుగు వేయాలని వివరించారు.

బీటీరోడ్డుకు మోక్షం..

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నిర్మాణంలో బీటీరోడ్డు

యాచారం: ఎట్టకేలకు బీటీరోడ్డుకు మోక్షం కలగడంతో ఆ రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఏళ్లుగా కంకరతేలి కాలినడకన వెళ్లలేని దుస్థితిలో ఉన్న అయ్యవారిగూడెం – నస్దిక్‌సింగారం గ్రామాల మధ్య రోడ్డు మరమ్మతులకు నోచుకుంది. సుమారు రూ.20 లక్షల నిధులతో రెండు కిలో మీటర్ల మేర బీటీని నిర్మిస్తున్నారు. రోడ్డు విషయమై.. ఆ గ్రామాల ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషితో రోడ్డు నిర్మాణం జరుగుతుండడంతో స్థానికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. అయ్యవారిగూడెం ప్రజలు.. ఈ రోడ్డు నుంచే నస్దిక్‌సింగారం మీదుగా కందుకూరు, ఆమనగల్లు, కల్వకుర్తి తదితర ప్రాంతాలకు వెళ్తారు.



కడ్తాల్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న ముస్లింలు



ఇబ్రహీంపట్నం: అంబేడ్కర్ కూడలిలో ముస్లింల ర్యాలీ

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

- ముస్లిం మైనార్టీల డిమాండ్
- దాడులు పిరికిపంద చర్యంటూ ఆగ్రహం
- ఉగ్రదాడికి నిరసనగా భారీ ర్యాలీలు
- ముష్కరుల దిష్టిబొమ్మల దహనం

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/ కడ్తాల్: కశ్మీర్ పహల్గామ్‌లో అమాయకుల ప్రాణాలను బలిగొన్న ముష్కరులను మట్టుపెట్టాలని ముస్లింలు డిమాండ్ చేశారు. ఉగ్రదాడిని నిరసిస్తూ.. శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం మైనార్టీలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తామంతా భరతమాత బిడ్డలమని, పాకిస్తాన్ చేస్తున్న అడ్డగోలు చేష్టలను చూస్తూ ఊరుకోమని స్పష్టంచేశారు. ఉగ్రవాదాన్ని రూపుమాపేందుకు ప్రధాని మోదీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తమకు సమంజసమేనన్నారు. ఉగ్రభూతాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలని కోరారు. రాజకీయ నాయకులు స్వార్థం వీడి, దేశ భద్రతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మత పెద్దలు హైమద్ జాని, జహంగీర్ అలీ, ఆసీఫ్‌అలీ, లాయక్‌అలీ, ఇర్షాద్, జహంగీర్‌బాబా, అజ్గర్ అలీ, ఖాజా మైనొద్దీన్, అష్రఫ్, గౌస్, బాబా, నదీమ్, ఇద్రీస్, మిస్సి, అత్తిక్, జావీద్, ఖారి, హిమాయత్ అలీ, లతీఫ్, నబైద్, అబ్దుల్లా పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ తీశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద మృతులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అమాయకులను చంపిన ఉగ్రమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా నాయకులు బీక్యానాయక్, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు రాంచందర్, లక్ష్మయ్య, మల్లేశ్‌గౌడ్, చందోజీ, జహంగీర్‌అలీ, షాబుద్దీన్ ఉన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: కశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ముష్కరుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. జాతీయ జెండాలతో భారీగా ర్యాలీ తీశారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను అంతమొందించాలని కోరారు.

మంచాలలో..

మంచాల: కశ్మీర్ ఉగ్రదాడులను ముస్లింలు తీవ్రంగా ఖండించారు. జాతీయ జెండాలతో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అమాయకులపై ముష్కరుల దాడి పిరికిపంద చర్యని, పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను అంతమొందించాలని కోరారు. దేశ ప్రభుత్వానికి ముస్లిం సమాజం వెన్నంటి ఉంటుందన్నారు. మత పెద్దలు, మండల మాజీ కో– ఆప్షన్ సభ్యుడు ఎండీ సలాం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎండీ.జానిపాష, సలీం, జహంగీర్ పాషా, ఇర్ఫాన్, ఆసిఫ్‌ఖాన్, అక్బర్, అమీర్, అజీమ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

అమాయకులపై దాడులకు పాల్పడిన పాకిస్తాన్ ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలని ముస్లింలు డిమాండ్ చేశారు. ఉగ్రదాడిని ఖండిస్తూ.. నమాజు అనంతరం ఇబ్రహీంపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినదించారు.

ఆమనగల్లులో..

ఉగ్రదాడులకు నిరసనగా ముస్లింలు.. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పట్టణంలో భారీగా ర్యాలీ నిర్వహించారు. దాడులను ఖండిస్తూ.. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముష్కరులను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. జామ్య మసీదు కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మసూం, నాయకులు అబ్దుల్ ఖలీల్, సయ్యద్ ఖలీల్, జహంగీర్, నయీం, జబ్బార్, రహీం, ఖలీం, అలీం, అల్తాఫ్, మజీద్ ఖురేషి పాల్గొన్నారు.



తలకొండపల్లి: దిష్టి బొమ్మలను దహనం చేస్తున్న కమలనాథులు



మంచాల: ఆరుట్లలో నిరసన తెలుపుతున్న ముస్లింలు



ఆమనగల్లులో.. ముస్లింల ర్యాలీ

మలేరియా నిర్మూలనకు కృషి



ఆమనగల్లులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయొద్దు
- వైద్య పరీక్షలు చేయించుకోవాలి
- వైద్యులు మోహన్, నాగరాజు, సరిత
- మలేరియా అవగాహన ర్యాలీలు

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/ మాడ్గుల: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ మోహన్ అన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మాడ్గుల మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్.. 'మలేరియా అంతం మనతో' అని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనాఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం వలన మలేరియా జ్వరం వస్తుందన్నారు. వ్యాధి సోకిన వారికి వణుకుతో కూడిన చలి జ్వరం, వాంతులు, చెమటలు పోయుట, తలనొప్పి, ఒళ్లు నొప్పులు లక్షణాలు ఉంటాయని తెలిపారు. అలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే చికిత్స చేయించుకోవాలని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వైద్య సిబ్బంది హేమలత, మనోహర్ రెడ్డి, అనసూయ, ఏఎన్ఎమ్‌లు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వైద్య సేవలు ఉచితం

యాచారం: జాతీయ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం యాచారం మండల కేంద్రంలో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు సకాలంలో వైద్య సేవలు పొందాలని సూచించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుకు కావాల్సిన మందులు అందుబాటులో ఉన్నాయని, ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలను పొందాలని చెప్పారు.

ఆమనగల్లులో..

ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. దోమల ద్వారా మలేరియా వ్యాపిస్తుందని చెప్పారు. చలి, వణుకుతో కూడిన జ్వరం వస్తుందని, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే నెలల తరబడి బాధిస్తుందని తెలిపారు. మలేరియాకు చికిత్సతో పాటు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు మైమునా, మంజులాదేవి, సిబ్బంది విజయ, తిరుపతిరెడ్డి, నాగేశ్వరి, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే దోమలను ఆరికట్టడం సాధ్యపడుతుందని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ వైద్యురాలు సరిత అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించారు. వ్యాధి నివారణ, దోమలను ఆరికట్టే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాడ్గుల: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది



ఇబ్రహీంపట్నంలో..

కోర్టు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలం కేటాయించాలని కలెక్టర్ నారాయణరెడ్డిని ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో శుక్రవారం కలెక్టర్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్ ఆధ్వర్యంలో సభ్యులు కలిసి సన్మానించారు. భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు శేఖర్, మల్లేశ్, జయంత్, గణేశ్, బిక్యానాయక్, సర్దార్‌నాయక్, శిరీష, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌లో షాద్‌నగర్ విద్యార్థి సత్తా



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మనోహర్, నాగమణి దంపతులు

షాద్‌నగర్: పట్టణానికి చెందిన రిటైర్డ్ జడ్జి మనోహర్, రిటైర్డ్ సీడీపీఓ నాగమణి దంపతుల కుమారుడు భరద్వాజ్ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో 905 ర్యాంకును సాధించారు. భరద్వాజ్ 1 నుంచి 10వ తరగతి వరకు పట్టణ సమీపంలోని మరియారాణి శాంతి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించాడు. ఈ సందర్భంగా శుక్రవారం భరద్వాజ్ కుటుంబ సభ్యులు పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. భరద్వాజ్ ప్రస్తుతం ఢిల్లీలో ఇంటలిజెంట్ బ్యూరోగా విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలలో చదువుకున్న భరద్వాజ్ ఉన్నత విద్యను అభ్యసించి యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో ర్యాంకు సాధించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ మాడ్గుల మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్లమెంటు వేదికగా కేంద్ర మంత్రి అమిత్ షా అంబేడ్కర్ పై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర నాయకుడు రాంరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పాండు గౌడ్, నాయకులు కొండల్ రెడ్డి, సాయిరెడ్డి, జగన్, నర్సింహ్మ, దళపతి, బాబా, జంగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కల్పించడమే లక్ష్యం

తుర్కయంజాల్: ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం కల్పించడమే రాజ్యాంగ లక్ష్యమని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి అన్నారు. పార్టీ పిలుపు మేరకు శుక్రవారం తుర్కయంజాల్‌లో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ తీశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కొత్తకుర్మ శివ కుమార్, రాష్ట్ర సేవాదళ్ వైస్ ప్రెసిడెంట్ దాసు, పార్టీ మున్సిపల్ అధ్యక్షురాలు మంగమ్మ, మాజీ కౌన్సిలర్ సునీల్, నాయకలు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాడ్గుల: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కష్టపడి చదివితే భవిష్యత్తు

మంచాల: చిన్నారులు పాఠశాల స్థాయి నుంచి కష్టపడి చదివితే.. మంచి భవిష్యత్తు ఉంటుందని తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ అన్నారు. ఆరుట్ల ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన జాపాల గ్రామానికి చెందిన ఉత్తరపల్లి సౌమ్యను శుక్రవారం శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సౌమ్య ఎంపీసీలో 470 మార్కులకు 448 సాధించి, ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం వారి తల్లిదండ్రులు శుశ్రుత– నాగేశ్వర చారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మెండు రాజవర్ధన్‌రెడ్డి, యువజన సంఘాల నాయకులు హరీశ్, జగన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానించిన రమేష్ తదితరులు

అన్నదాతకు అండగా..

ఇబ్రహీంపట్నం: అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం డీసీఎంఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేసిందని, సన్న వడ్లకు అదనంగా రూ.500 బోనస్ అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ కరుణాకర్, మార్కెట్ డైరెక్టర్లు, వ్యవసాయ అధికారి శ్రవణ్, డీసీఎంఎస్ అధికారులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభించిన గురునాథ్‌రెడ్డి

హజ్ యాత్రికులు నిబంధనలు పాటించాలి

గోల్కొండ: హజ్ యాత్రికులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో హజ్ యాత్రకు ఎంపికైన వారికి జరుగుతున్న వాక్సినేషన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి వైద్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హజ్ యాత్రికులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్కానగరంతో పాటు మదీనాలో కూడా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన హజ్ యాత్రికులు ఉంటారన్నారు. పవిత్ర మసీదుల్లో కాలయాపన చేయకుండా తమవెంట ఉన్న హజ్ గైడ్ ఆదేశాలను, సూచనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. తమకు కేటాయించిన గ్రూప్ వారితోనే హజ్‌యాత్ర పూర్తయ్యే వరకు ఉండాలన్నారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



యాత్రికులలో మాట్లాడుతున్న ఏసీపీ

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

చేవెళ్ల: ప్రధాని మోదీపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం మేడిపల్లి కలాన్ గ్రామానికి చెందిన పత్తి మహేష్ తన సోషల్‌మీడియా అకౌంట్లలో పహల్గాం దాడిని ప్రధాని మోదీయే చేపించారని ఆరోపించినట్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి, తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకులు కుంచం శ్రీనివాస్, శర్వలింగం ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా నాదర్‌గుల్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నాం 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని శుక్రవారం ఏఈ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాదర్‌గుల్, కమ్మగూడ, ఎంఎల్ఆర్ కాలనీ, బృందావనం కాలనీ, కొత్తగడ్డ, శ్రీపురం, బాలాజీ హోమ్స్, వెంకటేశ్వర కాలనీ, ప్లాటినం సిటీ, రాజలక్ష్మి నగర్, లిబ్రా షెల్టర్స్, ఏఎంఆర్ కాలనీ, సెవెన్స్ హిల్స్, సిద్దార్థ కాలనీ, ఎంవీఎస్ఆర్ మెయిన్‌రోడ్, మాతృ శ్రీ నగర్, శాంతినగర్, వైకుంఠ పురం, ప్రెస్ కాలనీ, అశోక్ రెడ్డి ఎంప్లాయిస్ కాలనీ, సలీం వెంచర్, వినాయక నగర్, సాయిరాం నగర్‌లో సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

తుర్కయంజాల్ ఫీడర్..

తుర్కయంజాల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు లక్ష్మీ మెగా టౌన్ షిప్, పాటిగూడ, సూరజ్ నగర్, లక్ష్మీ గార్డెన్, కుర్మగూడ, వైఎస్ఆర్‌నగర్, తుర్కయంజాల్ గ్రామం, హెవెన్స్ కార్నర్, ఎస్ఎస్ఆర్ కాలనీ, శ్రీసాయి హ్యాపీ హోమ్స్, సాయి టౌన్ షిప్, అవివా హోమ్స్, ఎం.ఎం.కుంట, శోభా నగర్, సిలికాన్ సిటీ, ఆపిల్ సిటీ, ఏపీనగర్, వింటేజ్ హోమ్స్, యాదాద్రి నగర్, సాగర్ రెసిడెన్సి, సాగర్ ఎన్‌క్లేవ్, జన చైతన్య కాలనీ, సూర్యసాయినగర్, గంగిరెడ్డి వెంచర్, శ్రీశ్రీ ఎన్‌క్లేవ్‌లో సరఫరాకు అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు బాటసింగారం గ్రామం, పీర్లగూడెం, నీలకంఠ విద్యాపీఠం, ఇనాంగూడ, యశోదానగర్ కాలనీ, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా తారమతిపేట సబ్‌స్టేషన్ పరిధి జెఎస్‌గుప్తా, సాయివికాస్, సద్దుపల్లి ఇండస్ట్రీయల్ ఫీడర్ల కింద ఉదయం 8గంటల నుంచి 10 వరకు ఓంకార్‌గ్రీన్ ఎనర్జీ, జెఎస్ గుప్తా అండ్ సన్స్, రేణుకా ఇండస్ట్రీస్, యాదాద్రి, సాయిరోహిత్, వెన్‌వెలెట్, వికాస్, సారంగ్ ఎంటర్ ప్రైజెస్, శ్రీలక్ష్మి, రెడీమిక్స్, సూపర్‌ఫైన్ ఇండస్ట్రీస్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.